# నర్సరీల్లోని నారుతో..
# దిగుబడులు బాగు..

- తక్కువ ఖర్చుతో విత్తనం.. ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు
- నర్సరీల్లోని నారునే కొనేందుకు మొగ్గు చూపుతున్న రైతులు



నాగరగూడ నర్సరీలో ఆరోగ్యంగా పెరుగుతున్న వివిధ రకాల కూరగాయల నారు

షాబాద్, డిసెంబర్ 17: నాణ్యమైన, ఆరోగ్యకరమైన నారును పెంచాలంటే చాలా కష్టం. నారు పెంచే సమయంలో ఎండలు ఎక్కువగా ఉన్న, చలి అధికంగా ఉన్న మొలకెత్తిన నారు కుప్పకుప్పలుగా చనిపోతుంది. దీంతో అనుకున్న స్థాయిలో పంటను నాటుకోలేక అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పుడు అలాంటి నష్టాలు లేకుండా ఆరోగ్యకరమైన నారును అందించి అటు ఆర్థికంగా నష్టపోకుండా, ఇటు కాలం కలిసొచ్చేలా నర్సరీ కేంద్రా లు నారును పెంచి రైతన్నలకు సరఫరా చేస్తున్నాయి. తక్కువ ఖర్చుతో రైతులకు సకాలంలో ఆరోగ్యకరమైన నారు(మొక్కలు)ను తయారు చేసి ఇచ్చేందుకు రంగారెడ్డి జిల్లాలో పెద్ద ఎత్తున నర్సరీ కేంద్రాలు ఏర్పడ్డాయి. పలు గ్రామాల్లో కూరగాయాలను సాగు చేసే రైతులు తాము సాగు చేసే నారును కూడా నర్సరీల నుంచే తీసుకెళ్తున్నారు. రైతులు విత్తనాలు తెచ్చి ఇచ్చిన.. లేక రైతు చెప్పిన రకాన్ని నర్సరీల నిర్వాహకులు తెచ్చి పెంచి నారును ఇస్తున్నారు. విత్తనాలను రైతులు కొనుగోలు చేసి ఇస్తే తక్కువ ధరకే నారును విక్రయిస్తున్నారు. ఏడాది పొడవునా వంకాయ, టమాట, మిర్చి, కాలీప్లవర్, కూరగాయలు, బంతి, చామంతి, తదితర పూల నారును నర్సరీల్లో పెంచుతున్నారు.

### నర్సరీల్లో పెంచిన నారుకు తెగుళ్లు రావు...

నర్సరీల్లో విత్తనాన్ని శుద్ధి చేసి వైరస్‌లు సోకకుండా ప్రత్యేకంగా తయారు చేసిన షెడ్లల్లో నారును పెంచుతారు. ఎప్పటికప్పుడూ నారును పరిశీలిస్తూ కావాల్సిన పోషకాలు అందివ్వడంతో తక్కువ సమయంలోనే నారు ఏత దశకు వస్తుంది. పంట పొలంలో మొక్క నాటిన అనంతరం కూడా ఆరోగ్యంగా పెరిగి తొందరగా పంట చేతికి రావడంతో పాటు రైతు అధిక దిగుబడులు సాధించొచ్చు.

### విత్తనం వృథా కాదు..

ఒక్కొక్క విత్తనాన్ని ట్రేలల్లో జాగ్రత్తగా నాటడంతో ప్రతి విత్తనం మొలకెత్తి ఆరోగ్యంగా పెరుగుతుంది. సాధారణ స్థాయిలో రైతులు ఏర్పాటు చేసే నారు మళ్లలో ఎకరం టమాట సాగుకు సుమారు 80 గ్రాముల విత్తనం అవసరమైతే.. అదే నర్సరీల్లో ఎకరాకు 50 గ్రాముల టమాటవిత్తనం సరిపోతుంది. రైతులు విత్తనం ఇచ్చిన సమయం నుంచి టమాట 20 నుంచి 25 రోజులు, వంకాయ 40 నుంచి 45 రోజులు, మిర్చి 30 నుంచి 45 రోజులు.. కాలీప్లవర్, క్యాబేజీలు 30 నుంచి 35 రోజుల్లో ఏత దశ కు వచ్చి నారు సిద్ధంగా ఉంటాయి. దీంతో రైతులు పొలాల్లో నారును పోయకుండా నర్సరీల్లోనే పెం చేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.



నర్సరీలో నాడేందుకు సిద్ధంగా ఉన్న మిరప నారు

### రైతులకు నాణ్యమైన నారును ఇస్తున్నాం..



కూరగాయ పంటలు సాగు చేసే రైతులకు మంచి నారును అందిస్తున్నా. విత్తనాలను రైతులు కొనుగోలు చేసి ఇస్తే తక్కువ పైసలు తీసుకుంటా. విత్తనం బట్టి డబ్బులను తీసుకుంటున్నా. నర్సరీల్లో పెంచిన నారును సాగు చేస్తే పంటకు ఎలాంటి రోగాలు రాకుండా మంచి దిగుబడులు వస్తాయి. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు నర్సరీల్లోని నారును నాటేందుకు ఆసక్తి చూపుతున్నారు. **-రాజేశ్వరి, నర్సరీ నిర్వాహకురాలు**

# వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

**ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీచైర్ పర్సన్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ**





అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, మహాపడిపూజలో పాల్గొన్న స్వాములు, భక్తులు

తాండూరు, డిసెంబర్ 17 : తాండూరు పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీచైర్ పర్సన్ సునీతారెడ్డి వారి కుమారుడు రినీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాముల నృత్యా లు, భక్తుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. స్వాముల శరణు ఘోషతో తాండూరు భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. తాండూరు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నేతలు, ప్రజలు అధిక సంఖ్యలో పడిపూజలో పాల్గొని అయ్యప్ప స్వామి సేవలో తరించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

## వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి



వికారాబాద్, డిసెంబర్ 17 : ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వలకు చిక్కి తీవ్ర ఇబ్బందులు పడొద్దని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి ప్రజలు, యువతకు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే హెల్ప్‌లైన్ నంబర్ 1930 కాల్ చేయడంతోపాటు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే మోసపోతారని.. కొత్త, కొత్త పద్ధతుల్లో సైబర్ నేరాలు జరుగుతున్నాయని తెలిపారు. ఓటీపీ, సీవీవీ, బ్యాంక్ వివరాలను ఇతరులకు చెప్పొద్దన్నారు. ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలను ఎవరితో పంచుకోవద్దని.. అపరిచితుల ఫోన్‌కాల్స్, సంబంధం లేని మెసేజ్ లింకులను తెరిచి చిక్కుల్లో పడొద్దని సూచించారు.

# కొడంగల్ దవాఖానకు
# ఎక్స్‌రే పరికరాలు

- వాటిని అమర్చడం పూర్తైతే రోగులకు తప్పనున్న ఇబ్బందులు
- కేసీఆర్ ప్రభుత్వంలో 30 పడకల నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయిన కొడంగల్ దవాఖాన.. అందుతున్న మెరుగైన వైద్యసేవలు



కొడంగల్ దవాఖానకు చేరుకున్న ఎక్స్‌రే పరికరాలు



కొడంగల్, డిసెంబర్ 17: కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రభుత్వ దవాఖానల్లో అన్ని వసతులు సమకూరా యి. నూతన భవనాల నిర్మాణంతోపాటు వైద్యసౌకర్యాలు, వైద్యుల సంఖ్య కూడా పెరిగింది. గతంలో 30 పడకల దవాఖానగా ఉన్న కొడంగల్ సీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు నూతన భవనాన్ని నిర్మించింది. 50 పడకల దవాఖానగా మారడంతో వైద్యవిధాన పరిషత్ లో విలీనమైంది. దీంతో అప్పటి నుంచి అన్ని సౌకర్యాలు సమకూరాయి. రోజురోజుకూ రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ప్రస్తుతం దాదాపుగా ప్రతిరోజూ 200 మంది వరకు రోగులు వైద్యసేవలను పొందుతున్నారు. అదేవిధంగా కాన్పుల సంఖ్య కూడా పెరుగడంతోపాటు రోగులకు ఉచిత భోజన సదుపాయం కూడా అందుబాటులోకి వచ్చింది.

### డయాలసిస్ రోగులకు ఊరట..

ఈ ప్రాంతంలో అధిక మొత్తంలో డయాలసిస్ రోగులు ఉన్నారు. గతంలో వారు హైదరాబాద్, మహబూబ్‌నగర్, తాండూరు వంటి ప్రాంతాలకెళ్లి డయాలసిస్ చేయించుకునేవారు. కొడంగల్ దవాఖానలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కావడంతో వారికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పింది. అంతేకాకుండా వైద్య ఖర్చులూ తగ్గిపోయాయి. ఇక్కడ డియాలసిస్ రోగులకు వారికి కేటాయించిన తేదీల ప్రకారం సిబ్బంది చికిత్సను అందిస్తున్నారు.

### తాండూరుకు వెళ్లాల్సి వచ్చేది..

వ్యాధి నిర్ధారణకు ఉపయోగపడే ఎక్స్‌రే కేంద్రం అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇబ్బందిగా ఉండేది. ప్రైవేట్ దవాఖానల్లో ఎక్స్‌రే చేయించుకునేందుకు పేదలు ఫీజులకు భయపడేవారు. ప్రస్తుతం కొడంగల్ ప్రభుత్వ దవాఖానకు ఎక్స్‌రే పరికరాలు వచ్చాయి. వాటిని అమర్చడం పూర్తైతే రోగులకు ఎక్స్‌రే బాధలు తప్పుతాయి. ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్స్‌రే కేంద్రం అందుబాటులో లేక చాలా ఇబ్బందికరంగా ఉండేది. ఇందుకోసం తాండూరు దవాఖానకు వైద్యులు రిఫర్ చేసే వారు.

### ప్రారంభం కాని పోస్టుమార్టం గది..

కొడంగల్ దవాఖానలో అధునాతన పోస్టుమార్టం గది నిర్మాణం జరిగి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నది. గతంలో శిథిలావస్థకు చేరిన పోస్టుమార్టం గదిని తొలగించి అక్కడ కేసీఆర్ ప్రభుత్వం అన్ని వసతులతో నూతన భవనాన్ని నిర్మించింది. పోస్టుమార్టం గది అందుబాటులో లేకపోవడంతో ప్రమాదాల్లో మృతి చెందిన మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు తాండూరు ప్రభుత్వ దవాఖానకు వైద్యులు తరలిస్తున్నారు. అందువల్ల బాధితు లు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణం పూర్తైన పోస్టుమార్టం గదిని వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు.